సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 11 । మే । 2024




నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి న్యూఢిల్లీకి చెందిన పి.నాగ రఘురాం దంపతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. స్వామిని దర్శించుకున్నారు.



చిన వెంకన్న సేవలో..

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రాన్ని ట్రాన్స్‌కో విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మల్లారెడ్డి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. VIIIలో ▸

న్యూస్‌రీల్

నేడు కైకలూరులో సీఎం జగన్ సభ



హెలీప్యాడ్ వద్ద పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం కైకలూరు తాలూకా సెంటర్‌లో మేమంతా సిద్ధం సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కైకలూరు భాష్యం స్కూల్ సమీప గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు సీఎం జగన్ మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి తాలూకా సెంటర్‌లో బహిరంగ సభకు మధ్యాహ్నం 1.05 గంటలకు చేరి 1.55 గంటల వరకు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు పయనమవుతారు. హెలీప్యాడ్‌ను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు.

పటిష్ట భద్రత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీఎం జగన్ కైకలూరు పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. కైకలూరులో సభాస్థలి, హెలీప్యాడ్, ముఖ్యమైన ప్రాంతాలను తాను పరిశీలించానన్నారు. డీఎస్పీ ఈ. శ్రీనివాసులు, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

త్వరితగతిన ఎన్నికల ఏర్పాట్లు



అధికారులను ఆదేశాలిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): పోలింగ్ సామగ్రి పంపిణీకి త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆర్వోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని ఆర్వోలతో పోలింగ్ సామగ్రి పంపిణీ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. 12న ఎన్నికల సామగ్రి పంపిణీలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అన్ని వసతులను కల్పించాలని సూచించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ప్రకారం ఈవీఎంలను సరిచూసి పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ సమయంలో సమస్యలు ఎదురైతే సెక్టార్ అధికారులు రిజర్వుడు ఈవీఎం యంత్రాలను భర్తీ చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు ఆర్టీసీ బస్సులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కమాండ్ కంట్రోల్‌రూమ్ అధికారులు కానాల సంగీత్ మాధుర్, **జెడ్.వెంకటేశ్వ**రరావు, ఎం.మోహన్‌రావు, **యు.మంగపతి**రావు, ఆర్.విక్టర్, కె.జాషువా పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

భీమవరం: సాధారణ ఎన్నిక**ల పోలింగ్** ప్రశాంతంగా నిర్వహించేందుకు **సెక్టోరియల్** అధికారులు సమర్థవంతంగా **పనిచేయాలని** కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి **సుమిత్‌కు**మార్ ఆదేశించారు. శుక్రవార**ం భీమవరం** విష్ణు కళాశాలలో ఎన్నికల సాధార**ణ అబ్జర్వర్** ఎం.దీపతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈవీఎంల రీప్లేస్‌మెంట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మాక్ పోల్ ముందు, తరువాత ఈవీఎంల స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను అనుసరించాలన్నారు. పోల్‌డే మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. అధికారులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల పరిశీలకురాలు దీప మాట్లాడుతూ అధికారులు సమయానికి వెంటనే రిపోర్టులు అందించాలన్నారు.

అధికారులూ అప్రమత్తం

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా అందరూ సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల, పోలీసు యంత్రాంగాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరపడనుందన్నారు. అంతర్రాష్ట్ర లారీలు, వాణిజ్య వాహనాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ రోజు, ఎన్నికల ముందు రోజు జిల్లా ఎంసీఎంసీ నుంచి అనుమతితో ప్రింట్ మీడియాలో రాజకీయ ప్రకటనలను ముద్రించుకోవచ్చన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు.

అరాచకాల ఆరిమిల్లి

మట్టి మాఫియా.. రియల్ ఎస్టేట్ దందాలు.. బినామీ పేర్లతో కాంట్రాక్టులు.. వ్యాపారులపై బెదిరింపులు.. ఇవీ గత టీడీపీ పాలనలో తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సాగించిన అరాచకాలు. నియోజకవర్గంలో ఏ పనులు జరగాలన్నా ఆయన కనుసన్నల్లోనే.. ఆయన బినామీ కాంట్రాక్టర్లే టెండర్లు దక్కించుకోవాలి.. పొరపాటున ఎవరైనా టెండర్ దాఖలు చేస్తే అంతే సంగతులు. నీరు–చెట్టు మొదలు మరుగుదొడ్ల నిర్మాణం వరకూ అవినీతికి లెక్కేలేదు. –సాక్షి ప్రతినిధి, ఏలూరు





తణుకు.. తల్లడిల్లి..

- ఐదేళ్ల పాలనలో విధ్వంసకాండ
- బినామీ కాంట్రాక్టర్ల పేరుతో దోపిడీ
- మట్టి మఫియాకు ఆయనే డాన్
- రియల్ వెంచర్లలో భారీ అక్రమాలు
- మహిళలు, పోలీసులంటే చులకన
- ఆరిమిల్లి హయాంలో అభివృద్ధి శూన్యం

తణుకులో 2014–19 కాలంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నింటిలో నంబర్‌వన్ అని, రాష్ట్రంలోనే నంబర్‌వన్ ఎమ్మెల్యే అంటూ చంద్రబాబు కితాబు ఇచ్చారు. బహుశా అవినీతిని ప్రామాణికంగా తీసుకుని నంబర్‌వన్ స్థానం ఇచ్చి ఉంటారని నియోజకవర్గంలో ప్రజలు వ్యంగ్యంగా అంటున్నారు. అప్పట్లో ఐదేళ్ల పాలనలో ల్యాండ్ మార్క్ అభివృద్ధి అనేది లేకపోగా పెద్ద ఎత్తున పనులకు అనుమతులు తేవడం, ఏ ఒక్కటీ పూర్తి చేయకుండా భారీగా దండుకోవడమే ఆయన అజెండాగా సాగింది. సొంత సామాజికవర్గం వారికి ప్రాధాన్యమిస్తూ మిగిలిన వర్గాలను దూరంగా ఉంచారనే ఆరోపణలు ఉన్నాయి. పేదల భూములు ప్రైవేటుపరం చేసిన చరిత్ర ఉంది. అలాగే ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు ఏమీ లేకపోవడంతో విమర్శలు, దూషణలు, నిందలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. మళ్లీ అధికారం వస్తే సరికొత్త దోపిడీకి మార్గనిర్దేశం చేసేలా కేడర్‌కు దిశానిర్దేశం చేస్తుండటం విశేషం.

వందల ఎకరాల్లో 'రియల్' దందా

ఆరిమిల్లి రాధాకృష్ణ సొంత గ్రామం వేల్పూరు కేంద్రంగా వందల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ దందా పతాక స్థాయిలో సాగింది. రిజర్వు సైట్లు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల నిర్మాణం, మాస్టర్ ప్లాన్ గోల్‌మాల్ చేసి బాలాజీనగర్, విష్ణుప్రియనగర్, కామధేనునగర్‌లో సుమారు 500 ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటుచేశారు. 30, 40 ఎకరాల మేర రిజర్వు సైట్ లేకుండా చేసి రూ.80 కోట్ల వరకు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కావలిపురంలోని ప్రస్తుత జగనన్న కాలనీ లేఅవుట్ (11 ఎకరాల విస్తీర్ణం)ను గతంలో పేదల ఇళ్ల పట్టాల కోసం దివంగత వైఎస్సార్ హయాంలో మంజూరు చేస్తే దానిలో లెవిలింగ్ పనులకు ఆరిమిల్లి అనుమతులు తెప్పించి రెండు బిల్లులు పెట్టడంతో ఈ విషయం వివాదాస్పదమై ఆర్డీఓ విచారణతో నిలిచిపోయింది.

వక్ఫ్ బోర్డు భూములపైనా.. ఇరగవరంలో సుమారు 40 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములపైనా ఆరిమిల్లి ముఠా కన్ను పడింది. ముత్తావలీలు పూర్వంలో రైతులకు అమ్మేసిన భూమిని వక్ఫ్ బోర్డు ద్వారా స్వాధీనం చేసుకుని మట్టి దందాకు ప్లాన్ చేశారు. నిరసనలు, ఆందోళనలతో కోర్టుకెక్కడంతో ఈ వ్యవహారం పెండింగ్‌లో పడింది.

అక్రమాలు అనేకం

అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఫిల్టర్ తవ్వకాల కోసం తీసిన మట్టిని అమ్ముకోవడం, ప్రాంగణాన్ని పూడ్చడానికి రూ.20 లక్షలకు బిల్లులు పెట్టి దండుకోవడం, నీరు–చెట్టులో దోపిడీ, ఉపాధి హామీ పథకంలో భాగంగా 77 కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా నాటిన ట్రీగార్డుల్లో లక్షల స్వాహా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరవల్లి గ్రామంలో పనులకు 20 శాతం కమీషన్ దండుకున్నారని, వేల్పూరులో మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. అత్తిలి నుంచి గుమ్మంపాడు వరకు రూ.1.40 కోట్లతో 2.20 కిలోమీటర్ల మేర నిర్మించిన రోడ్డు ఆరు నెలలకే కోతకు గురైందంటే కమీషన్లు ఏ స్థాయిలో అందాయో అర్థం చేసుకోవచ్చు.

పేదల భూమి కంపెనీ పరం

ఆంధ్రా షుగర్స్ సమీపంలో 7.26 ఎకరాల కాల్వ మళ్లింపు భూమి ఉండగా దివంగత సీఎం వైఎస్సార్ పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని సంకల్పించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదనలు కూడా పంపారు. దీనిపై సదరు కంపెనీ కోర్టును ఆశ్రయించింది. తదనంతరం టీడీపీ అధికారంలోకి రాగానే ఈ భూమిని ఆంధ్రా షుగర్స్‌కు ఆరిమిల్లి భారీ వ్యవహారాలతో కట్టబెట్టారు. కౌన్సిల్ తీర్మానం చేసి భవిష్యత్‌లో ఇబ్బంది లేకుండా చేశారు. దీని విలువ సుమారు రూ.80 కోట్లకు పైనే ఉంటుంది. 400 మందికిపైగా దక్కాల్సిన భూమిని ఇలా కంపెనీకి ఆరిమిల్లి కట్టబెట్టారు.

పోలీసులు, మహిళలంటే చులకన

పోలీసులు, మహిళలు అంటే ఆయనకు చులకన. కె.ఇల్లిందలపర్రులో ఇళ్ల స్థలాల సమస్యపై మహిళలు నిలదీయగా.. ఆయన ఆగ్రహానికి గురై మహిళలను ఛాతీభాగంపై చేతులు వేసి తోసుకుంటూ ముందుకువెళ్లారు. దీనిపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. ఇరగవరం మండలంలో ఓ ఘర్షణ వివాదంలో టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారనే కోపంతో ఎస్సై, స్టేషన్ రైటర్‌ను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి తీవ్రస్థాయిలో దూషించడంతో పాటు వారిని అవమానించేలా నేలపై బలవంతంగా కూర్చోబెట్టారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీస్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయనపై కేసు కూడా నమోదైంది.

మట్టి మాఫియాకు డాన్

ఇరిగేషన్ పనులను అడ్డం పెట్టుకుని టీడీపీ మట్టిమాఫియా చెలరేగిపోయింది. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా గోస్తనీ, అత్తిలి కాల్వ, దువ్వ చానెల్‌కు మరమ్మతుల పేరుతో భారీగా దండుకున్నారు. దువ్వ–వయ్యేరు గట్టు నది ఇసుకను దోచుకుని రూ.100 కోట్లకుపైగా కూడబెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇరగవరం, అత్తిలి మండలాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో చెరువుల్లో నీరు–చెట్టు పథకం పేరుతో మట్టిని తవ్వి రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నారు. నరసాపురం కాల్వ గట్టును కూడా అడ్డగోలుగా తవ్వేసి మట్టి విక్రయించారు.

ధాన్యంలో రూ.14 కోట్ల స్కామ్

ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో టీడీపీ నేతలు ఆరిమిల్లి నేతృత్వంలో భారీ అవినీతికి పాల్పడ్డారు. ఇరగవరం మండలం కత్తవపాడులో జన్మభూమి కమిటీల లిస్టులో డ్వాక్రా మహిళల పేరుతో ధాన్యం కొనుగోలు చేసినట్టు బ్యాంకు ఖాతాలు సృష్టించి వారికి తెలియకుండా సొమ్ము చేసుకున్నారు. సుమారు రూ.14 కోట్ల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. డ్వాక్రా మహిళల ఆందోళనతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

మరోమారు జగన్‌ను ఆశీర్వదించండి

మంత్రి కారుమూరి

ఇరగవరం: ముఖ్యమంత్రిగా జగన్‌ను మరోమారు ఆశీర్వదించాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తూర్పు విప్పర్రు గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా గడపదాటకుండా అన్ని పథకాలు అందుకుంటున్నామని అంటున్నారన్నారు. కులమతాలు, పార్టీలు చూడకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమం అందించిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా జగన్ వస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాళ్ల పార్టీ వాళ్లనే చూసుకుంటామని లోకేష్ అనడం దుర్మార్గమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పింఛన్ సగం మందికి కట్ చేస్తారని, మళ్లీ జన్మభూమి కమిటీల పెత్తనం పెరుగుతుందన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమం పూర్తిస్థాయిలో అందాలంటే సీఎం జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. ప్రజలంతా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వెలగల సాయిబాబారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సైపురెడ్డి పెద్దిరాజు, గంజి సతీష్, షేక్ మాబ్, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.



తూర్పువిప్పర్రులో బైక్ ర్యాలీలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రఘురామ.. మీ మాటలు నమ్మలేం

- ఐదేళ్లలో ప్రజలను కన్నెత్తి చూసింది లేదు
- సొంతింటికి మాత్రం రోడ్డు వేయించుకున్నారని విమర్శ

సాక్షి, భీమవరం: తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు చెబుతున్న మాటలను నమ్మలేమని ప్రజలు అంటున్నారు. ఐదేళ్లు నరసాపురం ఎంపీగా పనిచేసినా ఏనాడు ప్రజలను, పార్టీ కేడర్‌ను పట్టించుకోలేదని, కనీసం సొంత నియోజకవర్గమైన ఉండి వైపు కన్నెత్తి చూడలేదని అంటున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కోడిపందాలకు స్వస్థలానికి రావడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. కరోనా విపత్తు సమయంలోనూ హైదరాబాద్, ఢిల్లీలో తిష్ట వేశారని, ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంట రాకపోవడంతో అభివృద్ధి మంత్రం జపిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అరకొరగా ఎంపీ నిధులు కేటాయించినా కనీసం పనులు ఎలా జరిగాయో పట్టించుకోలేదంటున్నారు. అయినా కాళ్ల మండలం పెద అమిరంలోని తన ఇంటికి మాత్రం రూ.48 లక్షల వ్యయంతో 360 మీటర్ల మేర విశాలమైన సీసీ రోడ్డు వేయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ రోడ్డులో పట్టుమని పది ఇళ్లు కూడా లేకపోగా, మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన చెబుతున్న మాటలను స్థానికులు విశ్వసించడం లేదని సమాచారం.



పెద అమిరంలో రఘురామకృష్ణరాజు ఇంటికి వెళ్లే సీసీ రోడ్డు

భీమవరం.. ప్రగతి పథం

- **ఐదేళ్లలో రూ.441 కోట్లతో అభివృద్ధి పనులు**
- **రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**
- ప్రజలకు రూ.1,251 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి

భీమవరం: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు అభివృద్ధి పనులు విషయంలో తనదైన ముద్రవేసుకున్నారు. గత 58 నెలల కాలంలో భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం రూరల్ మండలాల్లో దాదాపు రూ.441 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టగా.. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.1,251 కోట్ల లబ్ధి చేకూర్చారు.

అభివృద్ధి పనులు ఇలా....

- నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్స్, అంగన్‌వాడీ భవనాలు, డ్రెయిన్లు, రోడ్లు, పుంత రోడ్ల నిర్మాణం వంటి 135 పనులకు సుమారు రూ.32.83 కోట్లు ఖర్చు చేశారు.
- గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం పనుల్లో భాగంగా వాటర్‌గ్రిడ్స్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, ఓహెచ్ఎస్ఆర్, జగనన్న కాలనీలకు తాగునీటి సరఫరా వంటి మొత్తం 131 పనులకు సుమారు రూ.35.49 కోట్లు వెచ్చించారు.
- ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.34.84 కోట్లు ఖర్చు చేశారు.
- డ్రెయినేజీ శాఖ ద్వారా ఓఅండ్ఎం పనులు, పూడికతీత పనులకు రూ.8.45 కోట్లు,
- ఇరిగేషన్ శాఖ ద్వారా కాలువల మరమ్మతులకు రూ.1.10 కోట్లు,
- విద్యాశాఖ ద్వారా మనబడి నాడు–నేడు పనుల్లో భాగంగా జెడ్పీ స్కూళ్లలో ప్రహరీల నిర్మాణం, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల అదనపు పనులకు సుమారు రూ.11.34 కోట్లు
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనులు, ఇళ్లస్థలాల అభివృద్ధికి రూ.11.91 కోట్లు
- విద్యుత్‌శాఖ ద్వారా హౌసింగ్ కాలనీలకు విద్యుత్ సదుపాయం, సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటి పనులకు సుమారు రూ.11.20 కోట్లు ఖర్చు చేశారు.

పట్టణంలో రూ.132 కోట్లతో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టణంలో రూ.132 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు పూర్తిచేయగా.. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.313.85 కోట్ల లబ్ధి చేకూర్చారు. భీమవరం మండలంలో అభివృద్ధి పనులకు రూ.147.17 కోట్లు ఖర్చు చేయగా సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.457.55 కోట్లను ప్రజల ఖాతాల్లో జమచేశారు. వీరవాసరం మండలంలో అభివృద్ధి పనులకు రూ.46.68 కోట్లు ఖర్చు చేయగా.. రూ.479.86 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు చేకూర్చారు.



పంజావేమవరం-రాయకుదురు రహదారి



దుర్గాపురంలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్



భీమవరం మండలం శ్రీరామపురంలో రైతు భరోసా కేంద్రం



మత్స్యపురి-వీరవాసరం సిమెంట్ రోడ్డు నిర్మాణం (ఫైల్)

నేటితో ఎన్నికల ప్రచారం సమాప్తం



వీరవాసరంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రచారం

భీమవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం 5 గంటలతో తెరపడనుంది. సోమవారం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రచారం ఇక ముగియనుంది. దాదాపు నెల రోజులుగా గ్రామాలు, పట్టణాల్లో ఆటోలు, వ్యాన్లు వంటి వాహనాలపై అభ్యర్థులు ఫ్లెక్సీలు, మైక్‌లతో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలతో మమేకమయ్యారు. ఈ నేపథ్యంలో మార్చిలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మరింతల దూకుడు పెంచారు. కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సీట్లు సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికలో మీనమేషాలు లెక్కించడంతో ప్రచారంలో వెనుకబడిపోయారు. దీంతో కూటమి అభ్యర్థులు ప్రచార వాహనాల ద్వారా ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారు. ఇంటింటికీ ఓట్లు అభ్యర్థించేందుకు సమయం లేకపోవడంతో వాహనాలపైనే ప్రచారం మమ అనిపించారు. బీజేపీ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ నియోజకవర్గంలో కనీసం సగం గ్రామాలను కూడా సందర్శించలేదని చెబుతున్నారు. మొత్తానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో నిలిచి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం


తనిఖీల్లో పట్టుకున్న నగదును చూపుతున్న అధికారులు

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఓ వ్యక్తి నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ.2.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్ట్ అధికారి మహమ్మద్ మోహిద్దీన్ చెప్పారు. ఈ నగదు గాలాయగూడెంకు చెందిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలను చూపించినట్లయితే నగదును తిరిగి ఇస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియో గ్రాఫర్లు వీరమల్ల మధు, సాజన్ సాయి పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు : పోలసానిపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఎ.మాధవరావు చెప్పారు. పూళ్ల గ్రామానికి చెందిన పచ్చా రవిసాగర్ తన కారులో ద్వారకాతిరుమల వైపు వెళుతుండగా అధికారుల తనిఖీలో ఎటువంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదు తీసుకువెళుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ట్రెజరీలో జమచేస్తామని చెప్పారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ రాజు తనిఖీల్లో పాల్గొన్నారు.

మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

భీమవరం: భీమవరంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను శుక్రవారం చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అరవ వెంకటేశ్వరరావు అక్రమంగా 10 బీరు, మద్యం సీసాలు కలిగి ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకుని, మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచారం మేరకు మండలంలోని పర్వతాపురం గ్రామం వైపు వస్తున్న రేషన్ బియ్యం వ్యాన్‌ని పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. అందులో ఉన్న సుమారు 3 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాన్ డ్రైవర్ నక్కా శివపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఓటు హక్కు వినియోగంపై నేడు ముగ్గుల పోటీలు

ఏలూరు (మెట్రో): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగంపై కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏలూరులోని సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదును కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ వెంటే బీసీలు

- గడిచిన ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు
- జగన్ ప్రభుత్వంలో దక్కిన గౌరవం, ప్రాధాన్యత, సముచిత స్థానం
- అన్ని పదవుల్లోనూ 50 శాతం బీసీలకు కేటాయింపుపై హర్షం
- పూర్తి స్థాయిలో వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్న బీసీలు


బీసీల సమావేశంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నినాదాలు ఇస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనంతగా బీసీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత కల్పించడం, నామినేటెడ్ పదవుల్లో కేటాయింపులోనూ పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని బీసీ సంఘాల నేతలు కొనియాడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత బీసీలకు సముచిత స్థానం, గౌరవం, ప్రాధాన్యత కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కితాబిస్తున్నారు. అన్నింటా బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఇటు చట్ట సభలోనూ, అటు నామినేటెడ్ పదవుల్లోను అగ్ర తాంబూలం బీసీలకే కల్పించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కేవలం బీసీల సంక్షేమానికే రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అని గుర్తు చేస్తున్నారు. అన్ని పదవుల్లోనూ 50 శాతం బీసీలకు కల్పించి బీసీల పట్ల తనకున్న అంకితభావాన్ని చాటి చెప్పిన మనస్సున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ బీసీ సంఘాల నాయకులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఇటీవల ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించి తన ప్రేమాభిమానాలు చాటుకున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది వైఎస్సార్ సీపీనే అని గుర్తు చేస్తున్నారు. ఏలూరు, నరసారావుపేట ఎంపీ టికెట్లను యాదవులకు, నరసాపురం, రాజమహేంద్రవరం ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. గత పాలకుల మాదిరిగా కేవలం మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపింది సీఎం వైఎస్ జగన్ మాత్రమే అని, అటువంటి వ్యక్తిని మరోసారి సీఎం పీఠంపై కూర్చోపెట్టేందుకు రాష్ట్రంలోని ప్రతి బీసీ నడుబిగించి పనిచేయాలని బీసీ సంఘాల రాష్ట్ర స్థాయి నాయకులు పిలుపునిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీలు కృషి చేయాలని కోరుతున్నారు.

50 శాతం సీట్లు బీసీలకే ఇచ్చారు



ప్రస్తుత ఎన్నికల్లో అసెంబ్లీ 175, పార్లమెంటు 25 సీట్లు కలిపి మొత్తం 200 స్థానాలు ఉండగా వాటిలో 100 సీట్లు బీసీలకే కేటాయించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు సీఎం వైఎస్ జగన్. బీసీలంటేకే వలం బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ క్లాస్ అని చాటి చెప్పిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. బీసీలకు 50 శాతం కేటాయించి బీసీలపై తమ చిత్తశుద్ధిని చాటారు.

– లాకా వెంగళరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం



రాష్ట్రంలో యాదవులకు అత్యధిక రాజకీయ ప్రాధాన్యత కల్పించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్. టీటీడీ బోర్డు సభ్యునిగా తనకు అవకాశం కల్పించడం ఎంతో గొప్ప విషయం. స్వాతంత్ర్యం వచ్చాక ఏలూరు పార్లమెంటు స్థానంలో మొట్టమొదటిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కారుమూరి సునీల్ కుమార్‌కు సీటును కేటాయించి బీసీలపై తనకున్న ప్రేమాభిమానాలు చాటుకున్న నేత జగన్ అన్న.

– నెరుసు నాగ సత్యం, టీటీడీ బోర్డు సభ్యులు, ఏలూరు

నాయీబ్రాహ్మణులకు గౌరవం దక్కింది



గత పాలకులు నాయీబ్రాహ్మణులను అవహేళనగా మాట్లాడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మాకు గుర్తింపు, గౌరవం లభించింది. నాయీబ్రాహ్మణులను అవహేళనగా మాట్లాడితే చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా జీవో నంబర్ 50ను తీసుకువచ్చింది. నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించింది. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మాకు గౌరవం, గుర్తింపు లభిస్తుంది.

– గోనుగుంట్ల యలమందరావు, జాతీయ అధ్యక్షులు, నాయీబ్రాహ్మణ సంఘం, విజయవాడ

వైఎస్సార్ సీపీతోనే బీసీల అభివృద్ధి



ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బీసీలను అక్కున చేర్చుకుని సమ ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే. అటువంటి ప్రభుత్వం మళ్లీ రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను తిరిగి గెలిపించేవరకు బీసీలు స్టార్ క్యాంపెయినర్‌లా పనిచేయాలి. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటేనే బీసీల అభివృద్ధి సాధ్యం. గత ఐదేళ్లుగా బీసీల పట్ల సీఎం వైఎస్ జగన్ చూపించిన చిత్తశుద్ధే దీనికి నిదర్శనం.

– లక్కోజు రాజగోపాలాచారి, డైరెక్టర్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్, ఏలూరు

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అనంతరం విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట)లలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని రసీదు పొందాలన్నారు. కౌన్సెలింగ్ సమయంలో రసీదును తప్పక చూపించాలని తెలిపారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోని విద్యార్థులు కౌన్సెలింగ్‌ను అనర్హులన్నారు. ఇతర వివరాల కోసం 08816 297093 నంబర్‌లో సంప్రదించాలని కన్వీనర్ తెలిపారు.

కొఠారు ప్రచారానికి ఆటంకంపై కేసు నమోదు

పెదవేగి: ముండూరు ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిపై రాళ్లు, కోడిగుడ్ల దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ముండూరులో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అబ్బయ్యచౌదరిపై స్థానిక కాంగ్రెస్, టీడీపీకి చెందిన వారు కోడిగుడ్లు, రాళ్లు విసరడంతో స్థానికంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్త స్వల్పంగా గాయపడ్డాడు. అప్పటికే గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపుచేశారు. ఇదే క్రమంలో గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన నిందితులు ఎ.శ్రీనివాస్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏపీకి పట్టిన దరిద్రం చంద్రబాబు

- పేదలను ఇబ్బందులు పెట్టడమే బాబు నైజం
- ఈసారి కుప్పంలోనూ ఓడిపోవడం ఖాయం
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపాటు


తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : ఏపీలోని పేద ప్రజలను చంద్రబాబు అనే దుష్టదరిద్రం పట్టిపీడిస్తోందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పేద వర్గాలకు ఏ మంచి చేయాలన్నా వ్యవస్థలను మేనేజ్ చేసి అడ్డుకుంటున్న చంద్రబాబును రెండు రోజుల్లో ప్రజలు బంగాళాఖాతంలో కలపనున్నారన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవ్వాతాతలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మంలోకి తీసుకువచ్చి ఇచ్చే పింఛనును నిలిపివేశారని, గత ఐదేళ్లుగా అమల్లో ఉన్న విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల లబ్ధిని ఎన్నికల కోడ్ రాగానే చంద్రబాబు తన అనుయాయుల ద్వారా అడ్డుకున్నారని విమర్శించారు. తీరా ప్రభుత్వం పేదవర్గాలకు అందించే లబ్ధిని విడుదల చేసేందుకు అనుమతి ఇప్పించాలని హైకోర్టును ఆశ్రయించగా, శుక్రవారం రోజున రాష్ట్రంలో రూ.14వేల కోట్ల నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసే విధంగా న్యాయస్థానం ఆదేశాలిచ్చినప్పటికీ మరల మరొక పిటిషన్ ద్వారా పంపిణీ చేయకూడదనే విధంగా అడ్డుకున్నారని విమర్శించారు. అవినీతి చక్రవర్తి అయిన చంద్రబాబు తన రాజకీయ జీవితంలో మొదటి నుంచి కేసుల్లో ఎలా స్టేలు తెచ్చుకోవాలి, పేదలకు అందే పథకాలను ఎలా నిలుపుదల చేయాలనే విషయంలో మాత్రం మాస్టర్ డిగ్రీ చేశారని ఎద్దేవా చేశారు. పేదలకందాల్సిన లబ్ధిని నిలుపుదల చేసిన చంద్రబాబు పేదవర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత తెలంగాణలో పథకాల లబ్ధి పంపిణీలో ఎటువంటి ఆటంకం లేకుండా జరుగుతుండగా ఏపీలో మాత్రం చంద్రబాబు అనే దుష్టగ్రహం కారణంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేదలను ఇబ్బందులు పాలుచేస్తున్న చంద్రబాబును కుప్పంలో కూడా ప్రజలు ఓడించేందుకు సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. ప్రజలకు అందాల్సిన ప్రతి పైసాను ఎన్నికలు ముగిసిన తరువాత అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజలకు మంచి చేసే మనస్సు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉండగా, పేదవర్గాలను ఇబ్బందులు పాలుచేసి కార్పొరేట్ వ్యవస్థలకు దోచిపెట్టాలనే సంస్కృతి చంద్రబాబుదన్నారు. ప్రతి పథకాన్ని గుంటనక్కలా మాటేసి నిలుపుదల చేయిస్తున్న చంద్రబాబుకు ప్రజలు చుక్కలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పాల్గొన్నారు.

పోలవరంలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం: కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా ఈ ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరుగుతున్న కుట్రల మాదిరిగానే పోలవరం నియోజకవర్గంలో కూడా తనపై, తన భార్య ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిపై కూటమి నేతలు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా కుంగదీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ప్రతిసారీ తనను ఎదుర్కోలేక కుట్రలు, కుయుక్తులు పన్నుతూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 2004 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి, గిరిజన, గిరిజనేతరుల మధ్య భూసమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. పోలవరంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

వైఎస్సార్ సీపీలోకి వలసలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన పార్టీల నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తూర్పుపాలెంలో ఆచంట మండలం ఆచంట (నటరాజ్ థియేటర్)కు చెందిన సుమారు 30 మంది కాపు సామాజిక వర్గం నాయకులు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పార్టీలోకి ఆహ్వానించి, కండువా కప్పారు. చేరిన వారిలో ఎ.నాగేశ్వరరావు, చల్లాది రమేష్, విద్యన రమేష్, మద్దిశెట్టి ఏసు రాజు, తాటికొండ కృపాదాసు, మదిలిశెట్టి శ్రీను, కంబాల నరసింహమూర్తి, బొమ్మన రమేష్, యుద్ధం సాయి, పుట్ట సుమంత్, వనమాలి రమేష్, మేడిచర్ల రాజేష్, కోడూరి సాయి, పద్మారావు, కోడూరి రవి, నెక్కంటి బోసు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, కాటంశెట్టి హేమంత్, కంబాల మహేష్ ఉన్నారు. కార్యక్రమంలో చల్లాది రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, మేడిచర్ల సత్యనారాయణ (పండు), అద్దాల భోగిరాజు పాల్గొన్నారు.

మద్దతు పలికిన సీతారాముని చెరువు వాసులు

పెనుగొండ మండలం ములపర్రు సీతారాముని చెరువు ఎస్సీ సంఘాల నాయకులు శుక్రవారం తూర్పుపాలెం కార్యాలయంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ముురుగు సమస్యను పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పలివెల శీను, బులా సత్యనారాయణ, ధర్మారావు, సుబ్రహ్మణ్యం, నల్లిమెల్లి రాంబాబు, బిరా నాగరాజు, శ్యాంబాబు, బీర రామకృష్ణ, పోతుల నాగేశ్వరరావు, బులా సావిత్రి, తాడి పుష్ప, గూడాల మణి, వరలక్ష్మి, మాణిక్యం పాల్గొన్నారు.

ఎస్సీ మాదిగల సత్కారం

పోడూరు మండలం కవిటం ఉత్తరపాలెం ఎస్సీ మాదిగ సంఘ నాయకులు, కేవీపీ యూత్ యువకులు తూర్పుపాలెంలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును సత్కరించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సవరం తాతాజీ, తానేటి జైపాల్, సిద్దుల నరేంద్ర, పల్లెటి నరేష్, గంటిమి గణేష్ పాల్గొన్నారు.


శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలిపిన కవిటం ఉత్తరపాలెం ఎస్సీ సంఘాల నాయకులు


శ్రీరంగనాథరాజును సత్కరించి మద్దతు తెలిపిన ములపర్రు సీతారాముని చెరువు వాసులు

ఎమ్మెల్సీ కవురు సమక్షంలో..

పాలకోడేరు: గొల్లలకోడేరు శివారు గుబ్బలవారి పాలెంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సమక్షంలో తుమ్మలగుంట్లపాలెం వార్డు సభ్యుడు వీరవల్లి శ్రీను వేణుగోపాలరావుతో పాటు 100 మంది టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలు సంక్షేమ అభివృద్ధి ఫలాలతో సుఖశాంతులతో ఉన్నార్నారు. నవరత్నాలతో పేదలకు మేలు చేకూర్చడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా నరసింహరాజును, ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎ.శ్రీనివాస్, చెల్లబోయిన సింహాచలం, జీవి నరసింహరావు, పస్తుల సహదేవుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


గుబ్బలవారిపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

మంత్రి కారుమూరి సమక్షంలో..

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి యర్రాయిచెర్వు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి 30 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. త్వరలో జరిగే ఎన్నికలలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పాలా సత్యనారాయణ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


యర్రాయిచెర్వులో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

జోరుగా.. ఉత్సాహంగా ప్రచార పర్వం


పాలకోడేరు: పెన్నాడలో ప్రచారం చేస్తున్న ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం తారాస్థాయికి చేరింది. శనివారం ప్రచార పర్వం ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం అభ్యర్థులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పాలనను కొనసాగించేందుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు.

– సాక్షి, నెట్‌వర్క్


వీరవాసరం : వీరవాసరంలో రోడ్డు షోలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్

క్లుప్తంగా

అసత్య ప్రచారాలపై ఆగ్రహం


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణపై అసత్య ప్రచారాలు చేయవద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ కోడే వెంకట్రావు హైస్కూల్ వద్ద ఈ నెల 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ఎన్నిక సందర్భంలో ఎన్నికలను పరిశీలించే నిమిత్తం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ లోపలికి వెళ్లితే ఆయనను అక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారని అంటూ జనసైనికులు మీడియాలో చెప్పడాన్ని మంగరాజు తప్పు పట్టారు. ఎన్నికల జరుగుతున్న సమయంలో ఒంటరిగానే పోలింగ్ బూత్‌లోనికి కొట్టు సత్యనారాయణ ఒక్కరే వెళ్లారని, ఆయనతో పాటు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు ఎవరూ లోపలికి వెళ్లలేదన్నారు. కొట్టు లోపలికి వెళుతుంటే కొంత మంది జనసైనిక గూండాలు కొట్టుపై నినాదాలు చేశారే తప్ప అధికారులు, సిబ్బంది ఎవరు కూడా సత్యనారాయణను అడ్డుకోలేదని తెలిపారు. అసత్య ప్రచారాలు చేస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని మంగరాజు హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

అత్తిలి: విద్యుదాఘాతంతో ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన రైతు లింగోలు సుబ్బారావు(50) మృతిచెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సుబ్బారావు గురువారం ఉదయం పంటచేను వద్దకు వెళ్లిన సందర్భంలో ఇటీవల భారీగా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటాన్ని గమనించక పోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే కుటుంబ సభ్యులు గురువారం పంటచేనుకు వెళ్లే మార్గంలో బైక్ ఉండటాన్ని చూసి బయటకు పనిమీద వెళ్లి ఉంటారని భావించి ఇంటికి వచ్చేసారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు పంటచేను వద్దకు వెళ్లేసరికి తెగిన విద్యుత్‌వైర్లుపై పడి మృతిచెంది ఉండటాన్ని గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అత్తిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సుబ్బారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షేమం అందాలంటే సీఎంగా జగనే రావాలి

- జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం
- మంత్రి కారుమూరి
- మంత్రి కారుమూరి నిర్వహించిన పాదయాత్ర సూపర్ సక్సెస్


తణుకులో ఎన్నికల ప్రచార పాదయాత్రలో మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల


తణుకులో ఎన్నికల ప్రచార పాదయాత్రలో వృద్ధుడితో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అవినీతిరహితంగా సంక్షేమం అందాలంటే జగనే రావాలనే ఉద్దేశ్యం ప్రజల్లో బలంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. 2019లో ఇచ్చిన మేనిఫెస్టోని 99 శాతం అమలు చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలిచారని తాజాగా ప్రకటించిన మెనిఫెస్టోలో అదే సంక్షేమాన్ని డబుల్‌గా అందించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. 2014లో ఇచ్చిన 650 హామీల మెనిఫెస్టోలో చంద్రబాబు ఒక్కటి కూడా అమలు చేయలేదని ఏపీ ప్రజలంతా నిన్ను నమ్మం బాబూ అంటూ ఎద్దేవా చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తాడంతే అనే విధంగా ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని పెంచుకున్నారని, అమలు కాని హామీలను గుప్పించి ఎగ్గొట్టడంలో సిద్ధహస్తుడిగా చంద్రబాబు ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు.

విజయయాత్రగా సాగిన పాదయాత్ర...

తణుకులో మంత్రి కారుమూరి ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన పాదయాత్ర ఆద్యంతం ఆకర్షణగా నిలిచింది. భారీస్థాయిలో పాల్గొన్న పార్టీ శ్రేణుల తాకిడికి తణుకు రాష్ట్రపతి రోడ్డు కిక్కిరిసిపోయింది. పాదయాత్రలో భాగంగా ఏర్పాటుచేసిన తీన్ మార్ డప్పులు, ఫ్యాన్ సింబల్ తెలిపే మూడు చక్రాల వాహనాలు, లైటింగ్ బోర్డులు, కళాకారుల నృత్యాలు అలరించాయి. తణుకు సజ్జాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించిన ఈ ఎన్నికల ప్రచార పాదయాత్ర రాష్ట్రపతి రోడ్డు మీదుగా కేశవస్వామి ఆలయం, వేల్పూరు రోడ్డు, స్త్రీసమాజం రోడ్డు మీదుగా సజ్జాపురం చేరుకుంది. పాదయాత్రలో భాగంగా మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల రాష్ట్రపతి రోడ్డులోని దుకాణదారులు, ప్రయాణికులను నేరుగా కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి తమను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, మెహర్ అన్సారీ, చేశెట్టి శివశంకర్, కారుమంచి యోహాన్, రామిశెట్టి రాము, షేక్ ఫహీమా, బెజ్జవరపు హేమశ్రీ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

తణుకు టౌన్: రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరుతూ వివిధ గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. తణుకు పైడిపర్రులోని 31వ వార్డులో మంత్రి కారుమూరి కోడలు కీర్తి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు.

అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు


ఆరుగొలను గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాల రాజేష్


పుల్లాయగూడెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంచన్

తాడేపల్లిగూడెం రూరల్: అర్హత ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ పథకాలను తీయరని వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తనయుడు బాలరాజేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజేష్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు తాడేపల్లిగూడెం పట్టణంలో 458 కిలో మీటర్లు మేర తిరిగి ప్రచారం చేశానన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. అందరూ తన తండ్రిని గెలిపిస్తామని భరోసానిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎంగా జగన్‌ను, తాడేపల్లిగూడెం నియోకవర్గంలో కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. గత ఐదేళ్ల పాలన మాదిరిగా కాకుండా రానున్న ఐదేళ్లు పాలన బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం గురించి ప్రజలు ఆలోచన చేసి, తన తండ్రిని గెలిపించాలన్నారు. తద్వారా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 13వ తేదిన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణ, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకోవాలని కోరారు. అలాగే, పుల్లాయగూడెం గ్రామంలో అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తనయి కంచన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి తన తండ్రికి ఓటేసి గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు. ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సర్పంచ్ చీకట్ల పుష్ప లక్ష్మీకుమారి, నాయకులు చీకట్ల మల్లేశ్వరరావు, పిల్లా నరసింహారావు, శనగన సత్యనారాయణ, పిల్లా సుబ్బారావు, బుడిగిన పెద్దిరాజు, పాటంశెట్టి పెద్దిరాజు, బత్తిరెడ్డి శ్రీను, కామన చెల్లయ్య, చిక్కాల సత్యనారాయణ, సబ్బితి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కొట్టుకి అవినీతి అంటగట్టడం కూటమి నేతల అవివేకం


సమావేశంలో మాట్లాడుతున్న గుండుబోగుల నాగు, పార్టీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ శాఖ మంత్రిగా అవినీతిలేని స్వచ్ఛమైన పాలనను అందజేసిన కొట్టు సత్యనారాయణపై ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేయడం వారి అవి అవివేకానికి నిదర్శనమని కూటమిపై వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు అన్నారు. స్థానిక మంత్రి కొట్టు క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు విలేకర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుబోగుల నాగు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, బొద్దాని శ్రీనివాస్, తెన్నేటి జగ్జీవన్, కట్టుబోయిన కృష్ణప్రసాద్ పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఉపముఖ్యమంత్రి కొట్టుకు అవినీతిని అంటకట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కొట్టుపై చేస్తున్న ఆరోపణలు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. జనసేన అభ్యర్థి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లకు పార్కింగ్ స్థలంగా ప్రభుత్వానికి అప్పగించిన స్థలంలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణానికి అనుమతులిచ్చారన్నారు. ఆ సమయంలో దానిలో చైర్మన్ హోదాలో జనసేన అభ్యర్థి అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. రెండవ ఫ్లైఓవర్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మూడంతస్తుల దుకాణాల సముదాయాన్ని నిర్మించేందుకు సొమ్ములు తీసుకున్న అప్పటి మున్సిపల్ చైర్మన్ అవినీతి చిట్టా అంతా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. ఆ ప్రకారం అక్రమ నిర్మాణ భవనాలను కూల్చివేశారని తెలిపారు. రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్న కూటమి అభ్యర్థులందరూ కొట్టు సత్యనారాయణ వలనే రాజకీయ ప్రవేశం చేశారన్నారు. కూటమి నేతలే అవినీతికి పాల్పడి ఇతరులపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.





కొట్టు సత్యనారాయణ

ఒకే ఒక్కడు.. బరిలో ఏడుసార్లు

తాడేపల్లిగూడెం : ఒకే నియోజకవర్గం నుంచి వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి రికార్డు సృష్టించారు వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. 1994లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన.. అప్పటి నుంచి జరిగిన అన్ని ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 30 సంవత్సరాల పాటు తాడేపల్లిగూడెం కేంద్రంగా రాజకీయాల్లో ఉంటూ ప్రజాపక్షం వహిస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. 1994లో యువకుడు, ఉత్సాహవంతుడు, శ్రీమంతుడిగా ఉన్న కొట్టు సత్యనారాయణను అప్పటి నేతలు కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. అప్పటినుంచి ఆయన జయాపజయాలతో సంబంధం లేకుండా నిరంతరం కేడర్‌కు వెన్నంటే ఉన్నారు. వైఎస్సార్ హయాంలో 2004లో, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 2019లో విజయాలతో తండ్రీకొడుకుల హయాంలో ఎమ్మెల్యేగా చేసిన గుర్తింపు పొందారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆయనకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రిగా పదవులు ఇచ్చి గౌరవించడం విశేషం. తన పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గ రూపురేఖలను కొట్టు మార్చారు. మరోసారి 2024లోనూ బరిలో దిగిన ఆయన విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

- రుణమాఫీ పేరిట రైతులు, డ్వాక్రా మహిళలను ముంచిన చంద్రబాబు
- జిల్లాలో రూ.2,379 కోట్ల డ్వాక్రా రుణాలకు ఇచ్చింది కేవలం రూ.452 కోట్లే
- నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం పేరిట యువతకు వంచన
- డ్వాక్రా మహిళలు, రైతులను ఆదుకున్న సీఎం జగన్
- ఆసరాతో రూ.2,556 కోట్ల రుణాల మాఫీ
- రైతు భరోసా ద్వారా 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్ల సాయం
- జిల్లాలో ఐదు వేల మందికి పైగా నిరుద్యోగులకు సచివాలయ ఉద్యోగాలు
- చంద్రబాబు పాలనకు.. జగన్ పాలనకు బేరీజు వేస్తున్న ప్రజలు
- నిన్ను నమ్మం 'బాబు' అంటున్న జనం



ఆ రోజులు.. మళ్లీ వద్దు బాబూ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ చూసినా టీడీపీ, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలపై చర్చ జోరుగా సాగుతోంది. సూపర్ సిక్స్ అంటూ ఆచరణ సాధ్యంకాని హామీలిస్తున్న చంద్రబాబు చేతిలో మరోమారు మోసపోయేందుకు సిద్ధంగా లేమని రైతులు, డ్వాక్రా మహిళలు, యువత, వివిధ వర్గాల వారు అంటున్నారు. 2014లో కూడా ఇలానే చెప్పారని కాని హామీలు అమలు చేయలేదని.. ఇప్పుడు కూడా బాబు చెప్తాడు.. కానీ చేయడు అని తెగేసీ చెబుతున్నారు. సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడని ప్రజలు విశ్వసిస్తున్నారు.

సాక్షి, భీమవరం: చంద్రబాబు 2014లో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఆయన ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోనే. రుణమాఫీ పేరిట రైతులు, డ్వాక్రా మహిళలు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ యువతను, ఇలా అన్ని వర్గాలు.. అన్ని కులాలకు 650కు పైగా వాగ్దానాలతో ప్రజలను నమ్మించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాకా వాటిని గాలికొదిలేశారు. ప్రజలు ప్రశ్నించకుండా టీడీపీ మేనిఫెస్టోను ఏకంగా ఇంటర్నెట్ నుంచి తీసేశారు. 2019లో వైఎస్ జగన్ రాష్ట్రంలో కొత్త యుగానికి.. కొత్త అధ్యాయానికి నాంది పలికారు. నవరత్నాలు అమలు చేస్తానని వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో విడుదల చేశారు. అధికారంలోకి వచ్చాక 99 శాతం పైగా హామీలను అమలుచేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు.

బాబు నిండా ముంచితే.. జగన్ ఆదుకున్నారు

బేషరతుగా రుణాలన్ని మాఫీచేస్తానన్న చంద్రబాబు గద్దెనెక్కాక వ్యవసాయం దండగన్నారు. జిల్లాలోని లక్ష మందికి పైగా రైతులు వివిధ సహకార, వాణిజ్య బ్యాంకుల నుంచి ఏటా రూ.మూడు వేల కోట్లకు పైగా రుణాలు తీసుకుంటుంటారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి చివరకు అరకొరగా రూ.25 వేలు వరకు మాత్రమే ఇచ్చి చంద్రబాబు రైతులను నిండా ముంచారు. సాగులో విత్తు నుంచి విక్రయం దాక రైతులకు అండగా నిలిచారు సీఎం జగన్. పంట పెట్టుబడుల నిమిత్తం రైతుభరోసా పథకం కింద ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్లు అందజేశారు. 253 పంచాయతీల పరిధిలో రూ.65 కోట్లతో 298 రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు. విపత్తులతో ఏ సీజన్‌లో పంట నష్టం వాటిల్లితే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించారు. గత ఐదేళ్లలో 1,14,011 మంది రైతులకు రూ.217.64 కోట్లు ఉచిత పంటల బీమాగా, 1,40,015 మంది రైతులకు రూ.103.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందజేశారు. వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీపై విత్తనాల సరఫరా, పంట రుణాల పెంపు తదితర రూపాలలో సాగును పండగ చేశారు.

యువతను బోల్తా కొట్టించిన బాబు

జాబు రావాలంటే బాబు రావాలన్నారు. ఇంటికో ఉద్యోగం అన్నారు. ఉద్యోగం, ఉపాధి లేని యువతకు నెలకు రూ.2000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఉద్యోగాల కల్పన ఊసే ఎత్తలేదు. నిరుద్యోగ భృతిపైనా నీళ్లు చల్లి పాలన చివర్లో అరకొర మందికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అధికారంలోకి వచ్చిరాగానే సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించారు సీఎం జగన్. జిల్లాలోని ఐదు వేల మందికి పైగా యువతకు ఉద్యోగాలు వచ్చాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా వేలాది మంది యవతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. నవరత్న పథకాలతో పాటు ఎన్నికల్లో చెప్పని ఎన్నో పథకాలను అమలుచేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు సీఎం జగన్.

రుణమాఫీ అని డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశాడు

చంద్రబాబు 2014లో అధికారంలో వచ్చేనాటికి జిల్లాలోని 45,218 డ్వాక్రా సంఘాలపై రూ. 2,379 కోట్ల రుణభారం ఉంటే రుణమాఫీ హామీని తుంగలోకి తొక్కి సంఘాలను నిర్వీర్యం చేశారు. 2019 ఎన్నికల సమయంలో పసుపు – కుంకుమ అంటూ మూడు విడతలుగా కేవలం రూ.452 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. చంద్రబాబులా సీఎం జగన్ డ్వాక్రా మహిళలను మోసం చేయలేదు. ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలు తీసుకున్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీచేస్తానని చెప్పినట్టుగానే 2019 ఎన్నికల నాటికి 66,017 సంఘాలకు ఉన్న రూ.2,556 కోట్ల రుణభారాన్ని వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో మాఫీ చేశారు.

చంద్రబాబువి బూటకపు హామీలే



చంద్రబాబు చెప్పేవన్ని బూటకపు వాగ్దానాలే. ఆయన అధికారంలో ఉన్నన్ని రోజులు వ్యవసాయం దండగని సాగును నిర్వీర్యం చేశారు. 2014లో రైతు రుణమాఫీ చేస్తానని నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక మాట మార్చి రైతులను నిండా ముంచాడు.

– గోసాల సుదర్శనరావు, మూలపర్రు పెద్దగరువు

ఒక్క హామీ అమలు చేయలేదు



ఎన్నికల సమయంలో బోలెడు హామీలు ఇవ్వడం, తర్వాత ఒకటి కూడా అమలుచేయకపోవడం చంద్రబాబుకు అలవాటే. డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెబితే ఆయన మాటలు నమ్మి చాలామంది డ్వాక్రా రుణాలు కట్టడం మానేశారు. తర్వాత వడ్డీలతో అప్పు తడిసిమోపెడైంది.

– కదలి లక్ష్మీసుశీల, మూలపర్రు

బ్యాంకు నోటీసులొచ్చాయి



చంద్రబాబు మాటలు **నమ్మి డ్వాక్రా** అప్పులు **చెల్లించకపోవడం**తో చాలా **మందికి బ్యాంకు**ల నుంచి **నోటీసులు వచ్చా**యి. జగన్ **బాబు వచ్చాకే** మహిళలకు **మేలు జరిగింది**. ఎన్నికల్లో చెప్పినట్టుగానే వైఎ**స్సార్ ఆసరా** పథకం ద్వారా మా డ్వాక్రా రుణా**లన్ని మాఫీ చేసి** మేలు చేశారు.

– పోతుమూడి అనుసూయ, పోడూరు

మరోసారి మోసపోం



చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేము. సీఎం జగన్ పాలనలో మాకు మంచి జరిగింది. రుణమాఫీ చేశారు, చేయూత పథకం ద్వారా ఐదేళ్ల పాటు ఏటా రూ.15000 చొప్పున అందజేసి ఆదుకున్నారు. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– మద్దిరాల మరియమ్మ, సిద్ధాపురం

నిరుద్యోగులను ముంచిన బాబు



ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అని నమ్మించి నిరుద్యోగ యువతను చంద్రబాబు నిలువునా మోసం చేశారు. నిరుద్యోగ భృతి లేదు. ఉపాధి అవకాశాలు చూపలేదు. జగనన్న వచ్చాకే యువతకు మేలు జరిగింది. సచివాలయ ఉద్యోగాలు, పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించారు.

– పడమటి నాగబాబు, పెనుమదం


పట్టణంలో నిర్మితమైన తారురోడ్డు


ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన ఆసుపత్రి భవనాలు


పురపాలక సంఘ భవనానికి కొత్త రూపు

ప్రగతి బాటలో.. గూడెం అడుగులు

- దాహార్తి తీర్చనున్న రెండో వేసవి జలాశయం
- పేదల కోసం సొంతింటి గృహాలు
- పలుచోట్ల కొనసాగుతున్న రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు


దాహార్తి తీర్చనున్న రెండో వేసవి జలాశయం

తాడేపల్లిగూడెం: గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విజనరీ చర్యలతో గూడెం పట్టణం కొత్త రూపు సంతరించుకుంది. భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా రెండో వేసవి జలాశయం, స్యూయిజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు వంటివి తుదిదశకు చేరుకొని అందుబాటులోకి రానున్నాయి. రెండోవేసవి జలాశయం కోసం 32 కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఉన్న యానాదుల కాలనీ సమస్యను పరిష్కరించారు. యానాదులకు రూ. 59.45 లక్షలతో కాలనీ కట్టి 33 కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. పట్టణంలో రోజు సేకరించిన చెత్త నుంచి సిరులు వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. పలుచోట్ల తారు రోడ్లు నిర్మించారు. పురపాలక సంఘానికి కొత్త రూపు వచ్చింది. ఫౌంటెన్‌లు, గార్డెన్‌లు కొత్త శోభను తెచ్చాయి. ఐదేళ్ల కాలంలో సుమారు రూ.300 కోట్లకు పైగా నిధులను గూడెం అభివృద్ధికి వెచ్చించి పనులు చేపట్టారు.

అభివృద్ధి పనుల వివరాలు ఇవి..

- 14వ ఆర్థిక సంఘం నిధులతో రూ.2397.98 లక్షలతో 27 వేల మంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా సీసీ రోడ్డు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా, పార్కులు, శ్మశానాలను అభివృద్ధి చేశారు.
- 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.992.68 లక్షలతో 24వేల మందికి ప్రయోజనం కలిగే విధంగా మొక్కలు నాటడం, పార్కులు అభివృద్ధి పనులకు వెచ్చించారు.
- జగనన్న హౌసింగ్ కాలనీల కోసం సేకరించిన 61 ఎకరాలలో వేసిన 11 లేఅవుట్లలో 2651 ఇళ్లకు అంతర్గత రహదారులు, స్థలపూడిక కోసం రూ.460.98 లక్షలు వినియోగించారు.
- గడపగడపకు మన ప్రభుత్వం గ్రాంటుగా ఏడు కోట్లు కేటాయించారు. 35 వార్డులలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కోసం ఈ నిధులను వెచ్చిస్తున్నారు.
- అమృత్ 2.0 నిధులు రూ.1540 లక్షలతో కొత్తగా ఏర్పాటుచేసిన జగనన్న ఇళ్ల కాలనీలకు మంచినీటి సరఫరా లైన్ల కోసం 28 వేల ఇళ్లకు ప్రయోజనం కలిగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.
- మనబడి నాడు నేడు కింద 17 పాఠశాలల్లో వసతుల కల్పన కోసం కొన్ని కోట్లు వినియోగించారు. పనులు ప్రగతిలో ఉన్నాయి.
- సుమారు రూ.11 కోట్లతో 72 పనులను సాధారణ నిధుల నుంచి చేపట్టారు. వార్డు స్ట్రీట్ లైటింగ్, నాడు నేడు, మంచినీటి సరఫరా, రహదారులు, డ్రెయిన్ల కోసం వినియోగించారు. అర్బన్ హెల్త్ సెంటర్ గ్రాంటుతో అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు.
- రూ.32.14 కోట్లతో ఎస్‌టీపీ (మంచినీటి శుద్ధి కర్మాగారం) నిర్మిస్తున్నారు.


స్యూయిజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు


చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం


తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ పరిధిలో యానాదుల కాలనీ

పోలింగ్ సిబ్బందికి విందు భోజనం



గణపవరం: పోలింగ్ విధులకు వెళ్లాలంటేనే ఉద్యోగులు బెంబేలెత్తుతారు. ఎలాగైనా పోలింగ్ విధులు కేన్సిల్ చేయించుకోవడానికి చేయని ప్రయత్నాలంటూ ఉండవు. దీనికి కారణం ఊరుకాని ఊరికి ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. సమయానికి సరైన భోజనం ఉండదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి, మన శ్శాంతిగా కునుకుతీయడానికి ఏమాత్రం అవకాశంలేక ఉక్కబోత, దోమల మోతతో రేయంతా జాగారం చేసి తెల్లారగానే పోలింగ్ విధులు నిర్వహించడం పరిపాటి. ఇక సిబ్బందికి సరైన భోజనంకాని, టిఫిన్స్‌కాని గగనమే. బిస్కెట్ ప్యాకెట్లు, టీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. దీనితో ఎన్నికల విధులంటేనే ఉద్యోగులు హడలిపోయే పరిస్థితి. అయితే ఈసారి సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ సిబ్బంది కష్టాలు చాలావరకూ తీరనున్నాయి. నాడు – నేడు పథకంలో చాలా గ్రామాల్లోని పాఠశాలలు సకల సదుపాయాలతో ఇంటికి మించిన వసతులతో అలరారుతున్నాయి. నూతన తరగతి గదులు.. సరికొత్త బెంచీలు, గదికి రెండు, మూడు ఫ్యాన్‌లు, ఆధునాతన టాయిలెట్స్, నిరంతరం నీటి సరఫరా, తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్లు ఉండటంతో సిబ్బందికి వసతి సమస్యలో ఇబ్బందులు తప్పినట్లే.

సరికొత్త మెనూ

పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ భోజన సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది. పోలింగ్ ముందురోజున కేంద్రానికి చేరినప్పటి నుంచి, పోలింగ్ రోజున సాయంత్రం పోలింగ్ ముగిసే వరకూ ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశారు. 12వ తేదీ సాయంత్రం పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతి లేదా రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, పచ్చడి, ఆలూటమాట కూర, రసం, పెరుగు, వడియాలు, అరటిపండుతో భోజనం ఉండాలి. పోలింగ్ రోజు 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, 5 గంటలకు వేడి ఇడ్లి, గారె, రెండురకాల చెట్నీలతో అందించాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరినీరు, 11 గంటలకు కేకు, టీ, మధ్యాహ్నం 12.30 గంటలకు విజిటబుల్ బిర్యాని, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, 3 గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్‌సలాడ్, సాయంత్రం 6 గంటలకు బొండా, గారి, చెట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి, వేడివేడి ఆహారపదార్థాలను ఫ్రెష్‌గా వడ్డించాలని సంభందిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 15 మంది సిబ్బంది చొప్పున మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు.

మేమంతా సిద్ధం..!



ఎన్నికల ప్రచారంలో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులో శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిర్వహించిన పాదయాత్ర ఆద్యంతం ఆకర్షణగా నిలిచింది. భారీస్థాయిలో పాల్గొన్న పార్టీ శ్రేణులతో రహదారి కిక్కిరిసిపోగా.. తీన్‌మార్ డప్పులు, ఫ్యాన్ సింబల్ తెలిపే మూడు చక్రాల వాహనాలు, లైటింగ్ బోర్డులు, కళాకారుల నృత్యాలు అలరించాయి. – తణుకు అర్బన్